క్లుప్తంగా

ఎమ్మెల్సీ పరామర్శ



వెంగళ్‌రెడ్డి తల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : వైఎస్సార్‌సీపీ 53వ డివిజన్ ఇన్‌చార్జి మందేటి వెంగళ్‌రెడ్డి కుటుంబాన్ని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ నగర ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి గురువారం పరామర్శించారు. నగరంలోని వెంకటేశ్వరపురం పునరావాస కాలనీలో ఉంటున్న వెంగళ్‌రెడ్డి తల్లి మందేటి సుబ్బమ్మ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ, ఈనెల 7వ తేదీన మృతిచెందారు. ఆమె ఉత్తరక్రియలు గురువారం జరగ్గా, ఎమ్మెల్సీ పాల్గొని నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరించాలి



మాట్లాడుతున్న సురేష్‌రెడ్డి

నెల్లూరు సిటీ : ప్రయాణికులతో ఆర్టీసీ ఉద్యోగులు మర్యాదగా వ్యవహరించాలని నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి అన్నారు. కాకుటూరులోని ఆర్టీసీ శిక్షణా కళాశాలను ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వచ్ఛభారత్ కార్యక్రమం సక్రమంగా జరగాలన్నారు. ఉద్యోగులు ప్రయాణికుల పట్ల దురుసుగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆరోగ్యశ్రీ సేవలపై ఆకస్మిక తనిఖీలు



వివరాలు తెలుసుకుంటున్న కో-ఆర్డినేటర్ సుధీర్‌కుమార్

నెల్లూరు(అర్బన్) : నగరంలోని రెయిన్‌బో, రిచ్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ ద్వారా అందుతున్న సేవలను గురువారం డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా(ఆరోగ్యశ్రీ) జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎన్వీ సుధీర్‌కుమార్ ఆకస్మిక తనిఖీలు చేశారు. ఆస్పత్రుల్లో చిన్నపిల్లల వార్డు, ఆర్థోపెడిక్ వార్డు, ఫిజియోథెరపీ విభాగాల్లో అందుతున్న వైద్యసేవల గురించి ఆరాతీశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ రోగులు ఆస్పత్రులకు వచ్చినప్పుడు యాజమాన్యాలు సకాలంలో చేర్చుకుని నాణ్యమైన వైద్యసేవలందించాలని సూచించారు. కొన్నిరకాల ఆపరేషన్లకు అదనంగా డబ్బులు వసూలు చేసినట్టు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. లోపాలు ఏమైనా ఉంటే వైద్యసేవామిత్రలు తక్షణమే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ వైద్య సేవా జిల్లా మేనేజర్ వెంకటమురళి, టీమ్ లీడర్లు పాల్గొన్నారు.

ప్రిన్సిపల్స్ సమావేశం 21న

నెల్లూరు (టౌన్) : జిల్లాలోని జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్‌కు ఈనెల 21న సమావేశం నిర్వహించనున్నట్లు ఆర్ఐఓ ఆదూరు శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. వచ్చే ఏడాదిలో జరుగనున్న ఇంటర్ ప్రాక్టికల్స్, పబ్లిక్ పరీక్షలకు సంబంధించి సన్నాహక చర్యలు, టీచింగ్, నాన్ టీచింగ్ వివరాల నమోదు, అపార్‌కార్డుల జారీ, కొత్త జూనియర్ కళాశాలల ఏర్పాటు, అఫిలియేషన్ల రెన్యూవల్ తదితర అంశాలపై చర్చించనున్నట్లు చెప్పారు.

జిల్లాలో యూరియా కొరత లేదు

• డీఏఓ సత్యవాణి

కోవూరు : జిల్లాలో యూరియా కొరత లేదని, ఈ విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయాధికారి(డీఏఓ) పి.సత్యవాణి తెలిపారు. కోవూరు మండలం పడుగుపాడు రైల్వే యార్డులో యూరియా లోడింగ్ జరిగే ప్రాంతాన్ని గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాకు ఈనెలలో 25 వేల మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉందని, ప్రస్తుతం 12 వేల మెట్రిక్ టన్నులు వచ్చినట్లు తెలిపారు. మిగిలిన 18 వేల టన్నుల యూరియా ఈ నెలాఖరులోగా వస్తుందన్నారు. యూరియా దొరకదని రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆమె వెంట జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకుడు నర్సోజీ, కోవూరు వ్యవసాయ సహాయ సంచాలకులు సుజాత, ఏఓ ఇందిరావతి తదితరులు ఉన్నారు.

పొదుపు మంత్రం పాటిద్దాం

• ఇంధన ఆదాతో భవితకు బాటలు
• చిన్నపాటి చిట్కాలతో ఎంతో పొదుపు
• నేటితో ముగియనున్న ఇంధన పొదుపు వారోత్సవాలు

ఒక యూనిట్ విద్యుత్ పొదుపు రెండు యూనిట్ల ఉత్పత్తితో సమానం. నేటి నిత్యావసరాల్లో ప్రధానమైనది విద్యుత్. అయితే దీని వినియోగం క్రమేపి పెరిగిపోతుండడం వల్ల సహజ వనరులు తగ్గుతున్నాయి. దీనివల్ల విద్యుత్ పొదుపుపై ప్రతిఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని ప్రభుత్వాలు కోరుతున్నాయి.



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : విద్యుత్ వనరులు ప్రధానంగా థర్మల్(బొగ్గు), జల, అణు, సోలార్, విండ్(గాలి మరలు)ల కేంద్రాల నుంచి ఉత్పత్తి అవుతుంది. ఇవి విద్యుత్ గ్రిడ్‌లు, 33 కేవీ విద్యుత్ లైన్‌ల ద్వారా సరఫరా చేసి సబ్‌స్టేషన్‌లలోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్ (పీటీఆర్)లలో ఉంచి అక్కడి నుంచి ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా గృహ వినియోగదారులు, పరిశ్రమలు, రైతులకు విద్యుత్ సరఫరా అవుతుంది. విద్యుత్‌ను పొదుపుగా వాడితే డబ్బు ఆదాతో పాటు విద్యుత్ నిల్వలను పెంచుకోవచ్చు. అంతేకాక నేడు మనం చేసే విద్యుత్ పొదుపు రేపటి తరాలకు వెలుగులు ప్రసాదించవచ్చు.

విద్యుత్‌ను వృథా చేయకుండా సరైన అవగాహన, ప్రణాళికాబద్ధంగా వినియోగిస్తే తప్పకుండా పొదుపు చేయవచ్చు. ఇందులో మహిళలు, విద్యార్థుల పాత్ర ఎంతో కీలకం.

పాటించాల్సిన చిట్కాలు

- అనవసర సమయాల్లో ఇళ్లు, కార్యాలయాల్లో లైట్లు, ఫ్యాన్లను ఆపివేయాలి.
- కిటికీలు, తలుపులు తెరచి ఉంచడం, లేత రంగుల కర్టన్లను వినియోగించడం వల్ల పగటిపూట లైట్ల వినియోగాన్ని తగ్గించవచ్చు.
- గ్యాస్‌స్టవ్‌లు, విద్యుత్ స్టవ్‌ల కంటే మైక్రోవేవ్స్, ఓవెన్‌ల ఉపయోగంతో 50 శాతం అధిక విద్యుత్ ఖర్చవుతుంది.
- ఫ్రిజ్‌లను ఎప్పుడూ ఆన్‌లోనే ఉంచాలి.
- గది ఉష్ణోగ్రతను నియంత్రించుకునే సామర్థ్యం కలిగిన ఏసీలనే కొనుగోలు చేయాలి.
- ఏసీతో పాటు గదిలో తక్కువ స్పీడ్‌లో ఫ్యాన్ వేయడం వల్ల తక్కువ సమయంలో గది చల్లబడుతుంది.
- ఇంటి చుట్టూ మొక్కలు, చెట్లను పెంచడం వల్ల ఏసీ ఉష్ణోగ్రతలో మార్పులు వచ్చి అదనపు భారం పడకుండా చూడొచ్చు.
- ప్రధానంగా విద్యుత్ గృహోపకరణాలను ఐఎస్ఐ మార్కు, స్టార్ రేటింగ్ కలిగిన వాటిని వినియోగించడం ఉత్తమం.

ఏటా

ప్రతి ఏడాది డిసెంబరు 14 నుంచి 20వ తేదీ వరకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను నిర్వహిస్తారు. ఇందులో వినియోగదారులు, రైతులు, మహిళలు, విద్యార్థులకు ఇంధన, విద్యుత్ పొదుపుపై అవగాహన కార్యక్రమాలు, ప్రచార కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహిస్తారు. పలు ప్రాంతాల్లో కరపత్రాల ద్వారా ప్రచారాలు నిర్వహిస్తున్నారు.



నగరంలో ఇంధన పొదుపుపై అవగాహన ర్యాలీ చేస్తున్న సిబ్బంది

అవగాహన కల్పిస్తున్నాం



జిల్లాలోని అన్ని డివిజన్లలో విద్యుత్ పొదుపుపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. విద్యార్థులకు చిత్రలేఖన, వ్యాసరచన పోటీలను నిర్వహించడంతో పాటు గ్రామాల్లో రైతులు, ప్రజలకు కరపత్రాల ద్వారా విద్యుత్ పొదుపు ఆవశ్యకత గురించి తెలియజేశాం. ప్రభుత్వ కార్యాలయాల్లో అనవసర సమయాల్లో విద్యుత్ వినియోగాన్ని తగ్గించేందుకు ఉద్యోగుల్లో చైతన్యం తీసుకొస్తున్నాం.

– విజయన్, ఎస్పీడీసీఎల్, జిల్లా సర్కిల్

సమస్యల పరిష్కారానికి వినతి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : గిరిజన గురుకులాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని వారు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి గురువారం వినతి పత్రాలు సమర్పించారు. అసోసియేషన్ నాయకులు తారా, రమణ, శ్రీనివాసులు, కృష్ణ, రాజ్యలక్ష్మి, కల్యాణ్, కృష్ణ, సునీల్ పాల్గొన్నారు.

పాస్టర్లకు సన్మానం

నెల్లూరు(బృందావనం) : రైల్వేఫీడర్స్ రోడ్డులోని లోన్‌స్టార్ చర్చిలో పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వార్షికోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్లను సన్మానించారు. రూరల్ తహసీల్దార్ లాజర్ హాజరై, మాట్లాడారు. గత ఎనిమిదేళ్లుగా ఎన్నో సేవలందిస్తున్న అసోసియేషన్ నిర్వాహకులను అభినందించారు. పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, లోన్‌స్టార్ చర్చి సంఘ కాపరి ఐఎస్ బెన్హర్‌బాబు వాక్య సందేశం ఇచ్చారు. అనంతరం కేక్ కట్ చేసి పాస్టర్లను సత్కరించారు. కార్యక్రమంలో ఎన్పీఎఫ్ ప్రధాన కార్యదర్శి రెవ.బి.డేవిడ్ దయాసాగర్, అబైడింగ్ హోప్ చర్చి పాస్టర్ డాక్టర్ టైటస్ నిర్మల్‌కుమార్, అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గడ్డం హనోక్, జాతీయ సమన్వయ కర్త ఎ.జయప్రకాష్, జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎ.రమేష్, కేఎస్.రాజు, వై.సదాశివరావు, ప్రధాన కార్యదర్శి ఎం.జాషువా, కోశాధికారి ఎస్.ఎనోష్, కార్యదర్శి జె.కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.



రక్తదానంతో ప్రాణదానం

నెల్లూరు(అర్బన్) : రక్తదానం మరొకరికి ప్రాణదానంతో సమానమని రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ సెంటర్ కన్వీనర్ అజయ్‌బాబు అన్నారు. తలసేమియాతో బాధపడుతున్న చిన్నారుల కోసం మహాయోగ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి గురువారం వరకు మూడు రోజుల పాటు మద్రాస్ బస్టాండ్ వద్ద ఉన్న రెడ్‌క్రాస్ కార్యాలయంలో బ్లడ్ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్‌బాబు మాట్లాడుతూ తలసేమియా పిల్లల కోసం ప్రత్యేకంగా రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం సొసైటీ ప్రెసిడెంట్ పి.లోకేష్, కో-ఆర్డినేటర్ మనోజ్, సభ్యుడు తమేమ్‌లను సన్మానించారు. కార్యక్రమంలో బ్లడ్‌బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వరప్రసాద్, రక్తదాన మోటివేటర్లు మధుసూదన్‌రావు, భాస్కర్‌రావు, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న మహాయోగ హెల్పింగ్ సొసైటీ సభ్యులు

సాంఘిక సంక్షేమ శాఖ డీడీగా శోభారాణి



కారుణ్య నియామక ఉత్తర్వులను అందజేస్తున్న శోభారాణి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులుగా శోభారాణి బాధ్యతలను గురువారం స్వీకరించారు. దర్గామిట్టలోని ఆ శాఖ కార్యాలయంలో ఆమెకు సూపరింటెండెంట్ లూకాస్, సిబ్బంది స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సాంఘిక సంక్షేమ శాఖలో యువరాజ్ సింగ్‌కు కారుణ్య నియామక ఉత్తర్వులను అందచేశారు. తొలుత కలెక్టర్ ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఏఎస్‌డబ్ల్యూఓ హజరత్తయ్య, వార్డెన్స్ అసోసియేషన్ రాష్ట్ర నేత విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచారం అందించండి

• ఏడీసీ నందన్



మాట్లాడుతున్న అదనపు కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు) : స్టాంపులు, రిజిస్ట్రేషన్‌ల శాఖ వారు ఐజీఆర్ఎస్ వెబ్‌సైట్‌లో నమోదు చేసేందుకు అవసరమైన సమగ్ర వివరాలను అందించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ నందన్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఎన్ఎంసీ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ మందిరంలో గురువారం రెవెన్యూ విభాగ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నందన్ మాట్లాడుతూ డివిజన్ల వారీగా ఇంటి నంబర్లు, ఏరియాల వివరాలను ప్రణాళికాబద్ధంగా అందించాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, రెవెన్యూ అధికారి ఇనాయతుల్లా, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, పరిపాలనా కార్యదర్శులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లను పరిశీలించాలి

నగరపాలక సంస్థ నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్లను సచివాలయ మహిళా ప్రొటెక్షన్, అమెనిటీస్ కార్యదర్శులు ప్రతిరోజూ పర్యవేక్షించాలని అదనపు కమిషనర్ నందన్ ఆదేశించారు. నగరంలోని హరనాథపురం కూడలిలో ఉన్న అన్న క్యాంటీన్‌ను ఆయన గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భోజన నాణ్యత, తాగునీరు, వంటశాల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ సచివాలయ కార్యదర్శులు ప్రతిరోజూ తనిఖీ చేసి నాణ్యత, మోతాదు తదితర అంశాలను క్రమం తప్పకుండా పరిశీలించి నివేదికలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు అందజేయాలని ఆదేశించారు.

నుడా ప్రతిష్టను పెంచేలా పనిచేయాలి

నెల్లూరు(బారకాసు) : నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రతిష్ట పెరిగేలా అధికారులు పనిచేయాలని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి కోరారు. నుడా వైస్ చైర్మన్ సూర్యతేజ ఆధ్వర్యంలో గురువారం నుడా కార్యాలయంలో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నుడా పరిధిలో గతంలో చేపట్టిన పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని మంత్రి నారాయణ సహకారంతో పూర్తి చేయాలన్నారు. ఆర్థిక లక్ష్యాలను చేరుకునేందుకు ఉద్యోగులు సహకరించాలని కోరారు. ఎన్టీఆర్ నెక్లెస్‌రోడ్డు, పార్కుల అభివృద్ధి వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వివరించారు. అనంతరం నుడా వైస్ చైర్మన్ సూర్యతేజ మాట్లాడుతూ అక్రమ లేఅవుట్లపై ఇప్పటికే ప్రత్యేక దృష్టి సారించామని, నిబంధనలకు విరుద్ధంగా వారిని గుర్తిస్తామని వెల్లడించారు. సమావేశంలో నుడా కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నుడా చైర్మన్ శ్రీనివాసులురెడ్డి

పెనుగొండకు అభినందన

నెల్లూరు(బృందావనం) : అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు 2024 వరించిన సందర్భంగా జిల్లా శాఖ గురువారం హర్షం ప్రకటించింది. తెలుగు సాహిత్యానికి పెనుగొండ చేసిన కృషి ఎంతో ఉందని, ఆయన రాసిన 'దీపిక అభ్యుదయ వ్యాస సంపుటి'కి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందని జిల్లా శాఖ గౌరవాధ్యక్షుడు పెరుగు రామకృష్ణ, అధ్యక్ష, ఉపాధ్యక్షులు గంగిశెట్టి శివకుమార్, టేకుమళ్ల వెంకటప్పయ్య, టీవీ రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి కె.కరుణశ్రీ, కార్యదర్శి అవ్వారు శ్రీధర్, కోశాధికారి అన్నం శివకృష్ణప్రసాద్ తదితరులు అభినందనలు తెలిపారు.

లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేసుకోండి

నెల్లూరు(బారకాసు) : నగరపాలక సంస్థ పరిధిలో టిడ్కో గృహాల తాళాలు అందుకున్న లబ్ధిదారులు ఈనెలాఖరుకు గృహ ప్రవేశాలు చేసుకోవాలని కమిషనర్ సూర్యతేజ సూచించారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. టిడ్కో గృహాల ప్రాంగణాల్లో నూతనంగా వీధి దీపాలను ఏర్పాటు చేశామని, పరిసరాల పరిశుభ్రతకు పారిశుద్ధ్య కార్మికులు నిరంతరం విధుల్లో ఉంటారన్నారు. సుమారు 6 వేల మంది ఇంకా గృహ ప్రవేశాలు చేయలేదని, వారు వెంటనే ఇళ్లల్లో చేరాలని కోరారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి

నెల్లూరు సిటీ : సైబర్ నేరగాళ్లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సెంట్రల్ సీఈఓ బి.శ్రీనివాసరావు అన్నారు. నగరంలోని నవలాకుల తోటలో ట్రేస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక అక్షరాస్యత, పొదుపు, సైబర్ నేరాలపై అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల బాధితులు 1930కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఫోన్‌లకు వచ్చే ఓటీపీ, డెబిట్ కార్డు పిన్ నంబర్లను ఇతరులకు చెప్పకూడదన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు శ్రీలత, నౌరాజ్, అహ్మద్, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రమాదపుటంచున ప్రయాణం



విద్యార్థులను ప్రమాదకర స్థితిలో తీసుకెళ్తున్న ఆటో

ఆటో డ్రైవర్లు నిబంధనలను తుంగలో తొక్కి ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్నారు. పరిమితికి మించి విద్యార్థులను ఆటోల్లో కుక్కి తరలిస్తున్నారు. ఆటో డ్రైవర్లు నెలకు ఒక్కో విద్యార్థి నుంచి రూ1,500కుపైగా వసూలు చేస్తున్నారు. ఇదే క్రమంలో అధిక ఆదాయం కోసం పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళ్తున్నారు. నిబంధనలను బేఖాతరు చేస్తూ రాకపోకలు సాగిస్తున్న ఆటోలపై సంబంధిత అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదు. ఏదైనా ప్రమాదం జరిగితే భారీ మూల్యం చెల్లించక తప్పని పరిస్థితి ఉంది.

– నెల్లూరు(క్రైమ్)

మహనీయుల త్యాగాలు స్ఫూర్తిదాయకం



రామ్‌ప్రసాద్ బిస్మిల్, అష్ఫఖుల్లా ఖాన్‌లకు నివాళులర్పిస్తున్న నాయకులు

నెల్లూరు(అర్బన్) : స్వాతంత్ర్య పోరాటంలో రామ్‌ప్రసాద్ బిస్మిల్, అష్ఫఖుల్లా ఖాన్‌ల త్యాగాలు యువతకు స్ఫూర్తిదాయకమని ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్.రషీద్ అన్నారు. స్థానిక బాలాజీనగర్‌లోని ఆవాజ్ జిల్లా కార్యాలయంలో పండిత్ రామ్‌ప్రసాద్ బిస్మిల్, అష్ఫఖుల్లా ఖాన్‌ల సంస్మరణ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రషీద్ మాట్లాడుతూ వారు బ్రిటీష్ అధికారుల బెదిరింపులు, మత ప్రాతిపదికన చిచ్చుపెట్టే ప్రయత్నాలను ధైర్యంగా ఎదిరించి హిందూ–ముస్లిం ఐక్యతకు ప్రేరణగా, త్యాగానికి ప్రతీకగా దేశం కోసం ప్రాణాలను అర్పించారన్నారు. వారి స్ఫూర్తిని నేటి యువత కొనసాగించాలన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్‌పై కేంద్ర హోమ్‌మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు మంచిది కాదన్నారు. దీనిని ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పుల్లయ్య, ప్రజానాట్య మండలి నాయకుడు సూర్యనారాయణ, ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకుడు సుబ్రహ్మణ్యం, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బీపీ నరసింహ, వెంకటరమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి హర్ష తదితరులు పాల్గొన్నారు.

సిటీ సర్వీసు ప్రారంభం



బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న నాయకులు

నెల్లూరు సిటీ : స్థానిక అయ్యప్పగుడి నుంచి చిన్నచెరుకూరు వరకు నూతన బస్సు సర్వీసును గురువారం నగరంలో ప్రారంభించారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి పాల్గొని, దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బస్సు సర్వీసును ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నగరంలోని ప్రధాన బస్టాండ్‌లను అనుసరిస్తూ సర్వీసు ఉంటుందన్నారు. కార్యక్రమంలో నెల్లూరు జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు, నెల్లూరు డిపో–2 మేనేజర్ శివకేశవ్‌యాదవ్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం, దుప్పట్ల పంపిణీ



నెల్లూరు(బృందావనం) : బాప్టిస్టు చర్చి డొనీహాల్ వార్షిక కార్యక్రమాల్లో భాగంగా వివిధ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం, దుప్పట్లను గురువారం అందజేశారు. వీఆర్సీ వద్ద ఉన్న చర్చిలో సంఘ కార్యదర్శి గుర్రం అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంఘ కాపరి రెవరెండ్ కె.శ్యాంసన్‌కుమార్, హుల్దా శ్యాంసన్, మేరీ సరళలు క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. అనంతరం 150 మందికి పౌష్టికాహారం, దుప్పట్లను అందజేశారు.

కార్యక్రమంలో చర్చి చైర్మన్ డి.సురేంద్రబాబు, ఇవాంజలిజమ్ డైరెక్టర్ గంటా జార్జి స్టీవెన్‌సన్, స్త్రీల సమాజం కార్యదర్శి అనితారాయ్, రూరల్ సంఘాల పాస్టర్లు రెవరెండ్ జేమ్స్, రెవ.శ్యామ్, డీకన్‌లు నిర్మల సుధాకర్, కృపాల్, వరప్రసాద్, కృపారాజన్ పాల్గొన్నారు.

వైభవంగా మండల పూజలు



నెల్లూరు(బృందావనం) : వేదాయపాళెంలోని అయ్యప్ప దేవస్థానంలో స్వామివారికి మండల పూజలు గురువారం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ఉదయం నుంచి రాత్రి వరకు క్షీరాభిషేకం, మహా గణపతి హోమం, పూజోత్సవాలు చేశారు. విశేషాలంకారంలో దర్శనమిచ్చిన శబరిమల వాసుడిని భక్తులు దర్శించుకొని తీర్థ ప్రసాదాలు, భిక్ష స్వీకరించారు. ఉభయకర్తలుగా నారపరెడ్డి మధుసూదన్‌రెడ్డి– శ్యామల దంపతులు వ్యవహరించారు. కార్యక్రమాలను శ్రీస్వామి అయ్యప్ప సేవాసమాజం అధ్యక్ష, కార్యదర్శులు గూడల శేషగిరిరావు, కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, కత్తి మోహన్‌రావు, గడ్డం విజయకుమార్, పావళ్ల ప్రసాద్ పర్యవేక్షించారు.